అస్తవ్యస్తంగా గ్రామీణ బ్యాంకు సేవలు

- ఇన్‌చార్జి మేనేజర్‌తో ఖాతాదారులకు ఇబ్బందులు
- పూర్తిస్థాయి మేనేజర్‌ను నియమించాలని ఖాతాదారుల డిమాండ్

కంగ్టి, ఫిబ్రవరి 23 : ఖాతాదారులకు ఉత్తమసేవలందించాల్సిన కంగ్టి తెలంగాణ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ అస్తవ్యస్తంగా తయారయ్యింది. అస్తవ్యస్తంగా మారడానికి అనుభవం లేని సిబ్బంది, పర్మినెంట్ మేనేజర్ లేకపోవడంతో బ్యాంకు ఖాతాదారులు నానావస్థలు పడుతున్నారు. మూడునెలల కింద ఇక్కడి మేనేజర్ బదిలీపై వెళ్లడంతో ఇన్‌చార్జి మేనేజర్‌గా ఫీల్డ్ ఆఫీసర్ మురళీ కొనసాగుతున్నాడు. ఇటు ఫీల్డ్ పనులతో పాటు మేనేజర్ పనులు కూడా చేయడంతో వారికి బ్యాం కు పనులు ఇబ్బందిగా మారాయి. ఆపై ఇటీవల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుగా ఉన్న దానిని ఇప్పుడు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారడంతో ఖాతాదారుల పాట్లు వర్ణణాతీతంగా మారాయి. ప్రతిదాని కోసం ప్రజలు నిత్యం డిజిటల్ పేమెంట్ ద్వారా లావాదేవీలను ప్రస్తుతం కొనసాగిస్తుండడం సర్వసాధారణంగా మారింది. దీనికోసం ఫోన్‌పే, గూగుల్‌పే యాప్‌లను ప్రజలు వాడుతుంటారు. తెలంగాణ గ్రామీణబ్యాంకుగా మారిన తర్వాత బ్యాంకు ఖాతాదారులకు చెందిన ఫోన్‌పే, గూగుల్‌పేలు పనిచేయకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయ్యారయ్యింది. ఫోన్‌పే, గూగుల్‌పే కోసం డెబిట్ కార్డు అవసరం కాగా గతంలో అందజేసిన డెబిట్‌కార్డులు పనిచేయడం లేదు. దీంతో ఫోన్‌పే, గూగుల్‌పే యాప్ ఇన్‌స్టాల్ చేసేందుకు అవసరమైన డెబిట్ కార్డు కోసం బ్యాంకులో ఖాతాదారులు క్యూ కడుతున్నారు. బ్యాంకులో పనిచేస్తున్న సిబ్బంది ఖాతాదారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏటీఎం కార్డు కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా డెత్‌క్లెయిమ్‌లు కూడా చేయడం లేదని ఖాతాదారులు తెలుపుతున్నారు. నిత్యం ఖాతాదారులకు అందుబాటులో ఉంటూ వారికి సంబంధించిన పనులు చేయాల్సిన అధికారులు ఖాతాదారులపై మండిపడుతున్నారు. కంగ్టి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు పూర్తిస్థాయిలో మేనేజర్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

కంగ్టి తెలంగాణ గ్రామీ ణ బ్యాంకు

మూడునెలలుగా తిరుగుతున్నా..

మాఅమ్మ చనిపోయి మూడుసంవత్సరాలైంది. అమ్మఅకౌంట్‌లో రూ. 1.28 లక్ష ఉన్నాయి. అమ్మఅకౌంట్‌లో ఉన్న డబ్బులు డ్రాచేసుకునేందుకు మూడునెలలుగా తిరుగుతున్నా.. డెత్‌క్లెయిమ్ కోసం డెత్ సర్టిఫికెట్, ఫ్యామి లీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర పత్రాలను తీసుకురమ్మన్నారు. పత్రాలను బ్యాంక్‌కు తీసుకుపోతే పైనుంచి పర్మిషన్ రాలేదు. కొన్ని రోజుల తర్వాత బ్యాంక్‌కు రమ్మన్నారు. అప్పుడు పోయిన అదే సమాధానం చెబుతున్నారు. బ్యాంకు చుట్టూ తిరిగి విసిగిపోయాం. మా డబ్బులు అందేలా చూడండి.

సంగప్ప, తుర్కవడగామ, కంగ్టి

క్లోజ్ చేయమని చెప్పి.. అయినా డబ్బులు కట్టినం..

తెలంగాణ గ్రామీణబ్యాంకులో మాఅమ్మమ్మ బిరాదర్ జిజియాబాయికి వ్యవసాయ రుణం ఉన్నది. గతనెల 13న మొత్తం రుణం డబ్బులు చెల్లించి రసీదు తీసుకున్నాం. ఇప్పుడు వెళ్లి బ్యాంకులో చూస్తే రుణానికి చెందిన అకౌంట్ క్లోజ్ కాలేదు. రూ. 1500 కడితే అకౌంట్ క్లోజ్ చేస్తామని చెబుతున్నారు. బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం ద్వారానే మా అమ్మమ్మకు చెందిన అకౌంట్ గతనెల క్లోజ్ చేయలేదు. నిర్లక్ష్యరాస్యులైన వారికి ఇలాంటివి చేస్తే ఏలా తెలుస్తుంది.

-బిరాదర్ యోగేశ్వర్, బోర్గి, కంగ్టి

నేటి ప్రజావాణి రద్దు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిమగ్నమైనందున ఈనెల 24న సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

విద్యాపీఠంలో రుద్రాక్ష శివ లింగం ఆవిష్కరణ

పూజలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కోటి 8 లక్షలతో తయారు చేసిన రుద్రాక్ష శివలింగాన్ని ఆవిష్కరించారు. ఆదివారం సంగారెడ్డి మండలం ఫసల్వాదీ సమీపంలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కోటి 8 లక్షలతో తయారు చేసిన రుద్రాక్ష శివలింగాన్ని విద్యాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ శ్రీమహేశ్వర శర్మ సిద్ధాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18.6 అడుగుల రుద్రాక్ష శివ లింగాన్ని తయారు చేసినట్లు వెల్లడించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 26న ఆశ్రమానికి వచ్చే ప్రతి భక్తుడు కోట రుద్రాక్ష శివలింగానికి అభిషేకం చేసే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు సరస్వతీదేవి అమ్మవారి గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈపూజా వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, పీఠం సభ్యులు పాల్గొన్నారు.

వాయు, జల కాలుష్యంతో ఆందోళన

బహిరంగ ప్రదేశాల్లోకి విడుదల చేసిన కాలుష్య జలాలను చూపుతున్న నాయకుడు లక్ష్మీరెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 23 : బహిరంగ ప్రదేశాల్లోకి విచ్చలవిడిగా వాయు, జల కాలుష్యాన్ని విడుదల చేస్తూ పరిశ్రమ యాజమాన్యాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కాలుష్య జలాలు విడుదలవుతున్న ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. మండుటెండల్లో సైతం పరిశ్రమ యాజమాన్యాలు విచ్చలవిడిగా కాలుష్య వ్యర్థ జలాలను వదిలివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగ మంచును కమ్మినట్లుగా వాతావరణంలోకి విడుదలైన ఘాటైన విషవాయువులు ఊపిరి పీల్చకుండా చేస్తున్నాయని వాపోయారు. కాలుష్య కారక పరిశ్రమల్లో పీసీబీ అధికారుల తనిఖీలు చేయకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారని దీంతో సామాన్య ప్రజల జీవితాలపై కాలుష్యం పెను ప్రభావం చూపుతుందని తెలిపారు. వాయు, జల కాలుష్యంపై పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఫలితం లేదని వాపోయారు.

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అందోల్, ఫిబ్రవరి 23 : జోగిపేటలోని ఎస్సీ బాలుర (కళాశాల) వసతిగృహంలో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారని వాటిని పరిష్కారించాల్సిన వార్డెన్ అందుబాటులో ఉండడంలేదని జిల్లా అధికారులు సైతం వీటిపై దృష్టి పెట్టడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేశ్ ఆరోపించారు. ఆదివారం జోగిపేటలోని కళాశాల ఎస్సీ వసతిగృహాన్ని తనిఖీచేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహంలో సమస్యలు తాండవం చేస్తున్నాయని సమస్యలను పరిష్కచాల్సిన వార్డెన్ ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితి ఉందన్నారు. నీటి కొరత ఉన్నదని పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయంపై ఫోన్‌చేసినా వార్డెన్ స్పందించడం లేదన్నారు. బాత్రూమ్‌లు సైతం కంపుకొడుతున్నాయని విధిలేని పరిస్థితిలో విద్యార్థులే వాటిని కడుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు స్పందించి వసతిగృహంలో సమస్యలను పరిష్కరించడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ

రేజింతల్ గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

జహీరాబాద్, ఫిబ్రవరి 23 : న్యాల్‌కల్ మండలంలోని రేజింతల్ గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన 25 కేవీ త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి వైరు అపహరించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని కుమ్మరి కాశన్న రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి వైరును ఎత్తుకెళ్లి మిగిలిన పరికరాలను పొలంలో వదిలి వెళ్లారు.ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైరు చోరీకి గురైనట్టు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని సంబంధిత అధికారులు సందర్శించారు. ఈ విషయమై హద్నూర్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఐసీఐసీఐ బ్యాంకులో షార్ట్‌సర్క్యూట్

గజ్వేల్, ఫిబ్రవరి 23: షార్ట్‌సర్క్యూట్ కావడంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని తూప్రాన్ మార్గంలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకులో ఆదివారం సాయంత్రం దట్టమైన పొగలు రావడంతో గమనించిన చుట్టు పక్కల వారు వెంటనే బ్యాంకు, ఫైర్, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించి అప్రమత్తం చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న బ్యాంకు మేనేజర్ నరేశ్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి డోర్లు తీయగా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. బ్యాంకులోకి వెళ్లేందుకు వీలులేకుండా ఉండడంతో కాసేపటికి ఫైర్ సిబ్బంది సాయంలో అందులోకి వెళ్లారు. అప్పటికే బ్యాంకు పైభాగంలోని సీలింగ్ నుంచి పొగలు వస్తుండడంతో మంటలు ఎక్కడి నుంచి వ్యాపించాయో తెలుసుకొని ఆర్పేశారు. సీలింగ్ నుంచి ప్రమాదవశాత్తు మంటలు రావడంతో బ్యాంకులోని కంప్యూటర్లు, ముఖ్యమైన ఫైల్స్, ఫర్నిచర్ ఇతర వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బ్యాంకులోని లాకర్ గదిలో ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి రీజినల్ బ్యాంకు మేనేజర్ మహమ్మద్ సర్వర్ ఐసీఐసీఐ బ్యాంకును సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

రాయికోడ్ మండల పరిధిలోని సింగితంలో శ్రీ దుర్గా భవానీ మాతకు బోనాలు తీస్తున్న మహిళలు, పాల్గొన్న గ్రామస్తులు. -రాయికోడ్, ఫిబ్రవరి 23

బీమాతో రైతులకు ధీమా

రైతు బీమా పథకాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 23 : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రైతులను ఆదుకోవడానికి ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం మృతిచెందిన రైతు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం ధీమాగా ఉందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూమాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామానికి చెందిన కర్రలచ్చవ్వ మంజూరు అయిన రైతు బీమా పథకం కింద రూ. 5 లక్షలు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బీఆర్‌ఎస్వీ నాయకురాలు శియారెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు బాపురాజ్ పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, అంజిరెడ్డి, సంగయ్యా, ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకయ్య, సంగయ్యా, తదితరులు ఉన్నారు.

చింతకుంటలో చికెన్ మేళా

చింతకుంటలో ఫ్రీ చికెన్ మేళాలో చికెన్, గుడ్లు అందజేస్తున్న నిర్వాహకులు

అందోల్, ఫిబ్రవరి 23 : చికెన్ తినడంపై అవగాహన కల్పించడంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ఫ్రీ చికెన్‌మేళాను వెన్‌కాబ్ పౌల్ట్రీల నిర్వాహకులు ఏర్పాటుచేశారు. చింతకుంట శివారుల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉడకబెట్టిన 2వేల కోడిగుడ్లు, రెండు వందల కేజీల చికెన్‌ను వండి ప్రజలకు అందజేశారు. చికెన్ తినడం వల్ల ఎలాం టి ముప్పులేదని, 70 డిగ్రీల సెల్సియస్‌లో వేడిచేయడం వల్ల ఎలాంటి వైరస్ ఉన్నా నశిస్తుందని అప్పుడు చికెన్ తిన్నా ఎలాంటి ఇబ్బందులు ఉండవని నిర్వాహకులు తెలిపారు. వెన్‌కాబ్ మేనేజర్లు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

నీటి సంపులో పడి యువకుడి మృతి

జిన్నారం ఫిబ్రవరి 23 : ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న నీటి సంపులో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీ తెలంగాణ కాలనీలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బీ జు కార్సేల్ (22) కాలనీలో నివాసం ఉంటూ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 22న రాత్రి ప్రమాదవశాత్తు ఇంటి ముందున్న నీటి సంపులో పడి మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పటాన్ చెరువు దవాఖానకు తరలించారు. తండ్రి థాబీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

ట్రోఫీతో త్రోబాల్ విజేతలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23 : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. టీనా ఆధ్వర్యంలో గేటెడ్ కమ్యూనిటీ వాసులకు నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా ఆదివారం టెన్నిస్, త్రోబాల్ ఫైనల్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు రేసింగ్ ఏహెడ్ సంస్థ బహుమతులను అందజేసింది. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ క్రీడల్లో ఆసక్తిని పెంపొందించేందుకే గేటెడ్ కమ్యూనిటీ వాసులకు క్రీడా పోటీలను నిర్వహించామని తెలిపారు. టెన్నిస్ కన్వీనర్ రామ్‌కుమార్, త్రోబాల్ కన్వీనర్ తాన్య, టీనా సభ్యులు ఉన్నారు.

కేతకీలో ప్రారంభమైన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

ఝరాసంగం, ఫిబ్రవరి 23 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు మంత్రాలు వల్లిస్తూ ఆదివారం అంకురార్పణ చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులతో కలిసి నాగుల పుట్టలో పాలు పోసి పుట్ట మట్టితో శిఖర పూజ చేశారు. అనంతరం పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన, శిఖర పూజ, పల్లకీ సేవ, విఘ్నేశ్వర పూజలు, ధ్వజారోహణం నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శివ రుద్రప్ప, అర్చకులు బసయ్యస్వామి, అంజయ్య స్వామి, వీరసంగ య్య, నాగయ్య స్వామి, మండల స్థాయి నాయకులు హనుమంత్ రావు పాటిల్, ఎంపీ సంతోష్ పాటిల్, శేఖర్ పాటిల్, మల్ల న్న పాటిల్, మల్లయ్య స్వామి, రాజేందర్ సింగ్, బస్వరాజ్ పాటిల్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చర్యలు

ప్లాంట్ లోపల శిథిలమైన స్లాబ్‌ను పరిశీలిస్తున్న హెచ్‌ఆర్ భాస్కర్‌రెడ్డి

జిన్నారం ఫిబ్రవరి 23 : హెటిరో పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ 20 రోజులుగా మరమ్మతులకు గురై మూత పడింది. దీంతో గ్రామ ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న పరిశ్రమ హెచ్‌ఆర్ భాస్కర్‌రెడ్డి ఆదివారం ప్లాంట్‌ను సందర్శించారు. ప్లాంట్‌లోని మరమ్మతులకు గురైన మిషనరీని పరిశీలించారు. అనంతరం భవనం స్లాబ్ పెచ్చులు శిథిలమై ఊడిపోతున్నాయని గమనించారు. రెండు రోజుల్లో ప్లాంట్ మరమ్మతు పనులను చేపడతామన్నారు. మండల కేంద్రంలోని ప్రజలకు సురక్షితమైన తాగు నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిటుకుల వెంకటేశ్, ప్లాంట్ ఆపరేటర్ యాదయ్య పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు సురేశ్

సంగారెడ్డి, ఫిబ్రవరి 23 : పెండింగ్‌లో ఉన్న 8214.57 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యారంగాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ ఆరేండ్లుగా విద్యార్థులకు ఫీజులు చెల్లించడం లేదని, ఏడాదికి నాలుగు లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. ఏడాదికి రూ. మూడు వేల కోట్ల నిధులు అవసరమవుతాయని, 2019 నుంచి ఇప్పటి వరకు రూ.82414.57 కోట్ల ఫీజుల రూపంలో బకాయిలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను ప్రభుత్వం గుర్తించి వెంటనే బకాయి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి విద్యార్థుల ఉన్నత చదువులకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు సిద్ధు, అనిల్, దినేశ్, శ్రీకాంత్, బన్నీ, నర్సింహులు, సాయి కృష్ణ, వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా అధ్యక్షుడు జయరాజు

సంగారెడ్డి, ఫిబ్రవరి 23 : దేశప్రజలను ఆందోళనకు గురి చేస్తూ అగ్రవర్ణాల తొత్తుగా వ్యవహరిస్తున్న బీజేపీ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించి గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కేవల్‌కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సమావే శం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలతో పాటు నిజామాబాద్, మెదక్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఓడించి బుద్ధి చెప్పాలని పట్టభద్రులను కోరారు. దేశ విచ్ఛిన్ననానికి జరుగుతు న్న తరుణంలో ప్రజలు సమన్వయంతో ఎమ్మె ల్సీ ఎన్నికల్లో ఇతర పార్టీల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలన్నారు. దీంతో మతోన్మాదశక్తులకు తెలంగాణలో తావులేదని పట్టభద్రులు చూపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్యం, రాజయ్య, మల్లేశం, రామచందర్, సాయిలు, నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర

జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన గురు స్వామి సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం శివ స్వాములు ఇరుముడులతో శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లారు. శివ స్వాముల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. -జిన్నారం, ఫిబ్రవరి 23

చర్చికి రూ. లక్ష విరాళం

చర్చి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 23 : పట్టణంలోని శాంతినగర్ మెథడిస్ట్ చర్చి నిర్మాణానికి ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్‌ఎస్ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్ రూ. లక్ష విరాళం అందజేశారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని మెథడిస్ట్ చర్చిని సందర్శించి రూ. లక్షను పాస్టర్ రంజిత్, సెక్రటరీ సొలమన్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా చర్చి ప్రతినిధులు పృథ్వీరాజ్‌ను సత్కరించారు. అనంతరం పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఎండీఆర్ ఫౌండేషన్ సమాజసేవలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. విద్యా, ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక ప్రదేశాల అభివృద్ధికి అండగా ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, విల్సన్, జేమ్స్, విక్రాంత్, జీవన్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రం వద్ద తమ హాల్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 23 : మండలంలోని కరస్‌గుత్తి బాలికల గురుకుల పాఠశాలలో సంక్షేమ గురుకులాల్లో 2025-26 సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష సజావుగా ముగిసింది. గురుకులాల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల కోసం సౌకర్యాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యార్థులకు క్షుణ్ణంగా తనిఖీలో అలసత్వం వల్ల చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కస్తూర్బా విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

అందోల్, ఫిబ్రవరి 23 : మండల కేంద్రం వట్‌పల్లికి మంజూరైన కస్తూర్బా బాలికల విద్యాలయం అందోల్ మండలంలో కొనసాగుతున్నదని, వెంటనే వట్‌పల్లిలో ఏర్పాటు చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా దళిత సంఘాల అధ్యక్షుడు దేవరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం జోగిపేటలో మాట్లాడుతూ వట్‌పల్లికి కస్తూర్బా విద్యాలయం మంజూరైనా ఇక్కడి విద్యార్థులకు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత బాలికలు ఎంతో నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారులు స్పందించి అందోల్‌లో నడుస్తున్న పాఠశాలను వట్‌పల్లిలో ఏర్పాటుచేసి విద్యార్థుల ఇబ్బందులను తొలిగించాలన్నారు.

ముగిసిన సెయింట్ ఆంథోనీస్ వేడుకలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 23 : స్థానిక శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఆదివారం మూడో రోజు రజతోత్సవ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన కృష్ణ భాగవతుల, సుభీర్ఖాన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. విద్యా సంస్థల అధినేత పాపులమ్మ సలోమాన్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న స్వామి జాతర

రామచంద్రాపురం, ఫిబ్రవరి 23 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో మల్లన్న స్వామి జాతర వైభవంగా జరిగింది. ఆలయ పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా భ్రమరాంబికమల్లికార్జున స్వామివారి కల్యాణం, అగ్నిగుండం, గంపల ఊరేగింపు, ఒగ్గుకథ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్సీపురం కురుమ సంఘం, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణమహోత్సవాన్ని జరిపించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, మా జీ కార్పొరేటర్ అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

జిన్నారం, ఫిబ్రవరి 23 : మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పోగొట్టుకున్న పర్సును బాధితులకు అందజేసి గ్రామస్తులు మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం జిన్నారం మీదుగా గోమారం గ్రామంలో వివాహ కార్యక్రమానికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు రహదారిపై పర్సు పోగొట్టుకున్నారు. వెంటనే గమనించిన స్థానికులు బుక్క భిక్షపతి, అశోక్ పర్సు సేకరించి వివరాలు తెలుసుకున్నారు. తెలిసిన వారితో మాట్లాడి పర్సులోని విలువైన నగదు, క్రెడిట్ కార్డులను తిరిగి బాధితులకు అప్పగించగా, గ్రామస్తులు అభినందించారు.